42వేల కోట్ల రైటాఫ్

6 నెలల్లో ప్రభుత్వ బ్యాంకులు వదిలించుకున్న రుణాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి 6 నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.42,035 కోట్లుగా ఉన్నది. ఈ మేరకు సోమవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి ప్రకటించారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) అత్యధికంగా రూ.8,312 కోట్ల రుణాలను ఖాతా పుస్తకాల నుంచి తొలగించిందని లోక్‌సభలో ఓ లిఖితపూర్వక సమాధానంలో మంత్రి పేర్కొన్నారు. ఆ తర్వాత స్థానాల్లో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (రూ.8,061 కోట్లు), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.6,344 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.5,925 కోట్లు) ఉన్నాయన్నారు. కాగా, 'రైటాఫ్ అంటే రుణాల రద్దు కాదు. కాబట్టి దీనివల్ల రుణగ్రహీతకు వచ్చే లాభమేమీ ఉండబోదు. రుణాలు తీసుకున్నవారు బ్యాంకులకు బకాయిపడే ఉంటారు. ఆ మొండి బాకీల వసూలుకు బ్యాంకులు రకరకాల పద్ధతుల్లో ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటాయి' అని మంత్రి పంకజ్ చౌధరి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఇదిలావుంటే ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ ఏప్రిల్-సెప్టెంబర్‌లో వసూలు చేసిన బకాయిల విలువ రూ.37,253 కోట్లుగా ఉన్నట్టు కూడా ఆయన తెలిపారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ప్రభుత్వ రంగ బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.1.14 లక్షల కోట్లుగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది రూ.1.18 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. దీంతో రెండున్నరేండ్లలో ప్రభుత్వ బ్యాంకుల లోన్ రైటాఫ్‌లు రూ.2.74 లక్షల కోట్లపైనేనని తెలుస్తున్నది. వీటిలో ఎక్కువ కార్పొరేట్ల రుణాలే ఉండటం గమనార్హం.

ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా

రెవెన్యూ కార్యదర్శిని నియమించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నూతన గవర్నర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి, రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాను సోమవారం కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆర్బీఐకి ఈయన 26వ గవర్నర్ కానున్నారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంత దాస్ పదవీకాలం మంగళవారం (డిసెంబర్ 10)తో ముగుస్తున్నది. ఈ క్రమంలోనే ఆయన స్థానంలోకి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తున్న సంజయ్ మల్హోత్రాను మోదీ సర్కారు తీసుకొచ్చింది. ఈ మేరకు కేబినెట్ నియామకాల కమిటీ లైన్‌క్లియర్ చేసింది. బుధవారం (డిసెంబర్ 11) నుంచి మూడేండ్లపాటు ఆర్బీఐ గవర్నర్‌గా సంజయ్ మల్హోత్రా బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు. ఐఐటీ కాన్పూర్ నుంచి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌ను పూర్తిచేసిన సంజయ్ మల్హోత్రా.. అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని సైతం పొందారు.

33 ఏండ్లలో..

33 ఏండ్ల తన కెరియర్‌లో ఎన్నో ప్రభుత్వ రంగ శాఖల్లో మరెన్నో బాధ్యతల్ని మల్హోత్రా నిర్వహించారు. రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. విద్యుత్తు, ఆర్థిక, పన్నులు, ఐటీ, గనులు తదితర రంగాల్లో సమర్థవంతంగా పనిచేశారు. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో రెవెన్యూ కార్యదర్శిగా పనిచేస్తుండగా, అంతకుముందు ఆర్థిక సేవల కార్యదర్శిగా ఉన్నారు. ముఖ్యంగా ప్రత్యక్ష, పరోక్ష పన్నులకు సంబంధించిన నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరించారు.

నేడు దాస్ పదవీ విరమణ

ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం పదవీ విరమణ చేయనున్నారు. రిజర్వ్ బ్యాంక్ 25వ గవర్నర్‌గా 6 ఏండ్లు పనిచేసిన ఆయన.. అప్పటి గవర్నర్ ఊర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో 2018 డిసెంబర్ 12న ఈ పదవిలోకి వచ్చారు. 1980 తమిళనాడు కేడర్ ఐఏఎస్ అధికారి అయిన దాస్.. కేంద్ర ఆర్థిక శాఖలోని వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ క్రమంలోనే 8 కేంద్ర బడ్జెట్లలో భాగస్వాములయ్యారు. ఇక అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్‌లో రెండుసార్లు టాప్ సెంట్రల్ బ్యాంకర్‌గా దాస్ అగ్రస్థానాల్లో నిలవడం విశేషం.

కేంద్రానికి దన్నుగా..

గవర్నర్‌గా ఊర్జిత్ పటేల్ వైఖరితో ఆర్బీఐ-కేంద్రం మధ్య దూరం పెరిగిన వేళ దాస్‌ను మోదీ సర్కారు తీసుకొచ్చింది. నిజానికి అప్పటికే దాస్ రిటైరైపోయారు. ఈ క్రమంలో తనపై కేంద్ర పెద్దలు పెట్టుకున్న నమ్మకాన్ని ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటూపోయిన దాస్.. ఆర్బీఐ మిగులు నగదు నిల్వలను కేంద్ర ఖజానాకు తరలించడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకున్నది. అంతేగాక ఏటా కేంద్రానికి భారీగా డివిడెండ్లనూ అందించారు. గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఏకంగా మునుపెన్నడూలేనివిధంగా రూ.2.11 లక్షల కోట్ల డివిడెండ్‌ను అప్పజెప్పారు. నిజానికి వీటిని వ్యతిరేకించే నాడు ఆర్బీఐ గవర్నర్ పదవికి పటేల్ రాజీనామా చేయడం గమనార్హం. ఇక కరోనా సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు వడ్డీరేట్లను బాగా తగ్గించడం, ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు అంతే స్థాయిలో పెంచడం, వృద్ధి-ధరల మధ్య సమన్వయం కోసం సుదీర్ఘకాలం వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే ఉంచడం దాస్‌కే చెల్లింది. 2016లో పాత పెద్ద నోట్ల రద్దు అంశంలోనూ నాటి ఆర్బీఐ గవర్నర్ పటేల్ కంటే దాసే కీలక పాత్ర పోషించడం విశేషం.

పేరు	: సంజయ్ మల్హోత్రా
వయసు	: 56 ఏండ్లు
చదువు	: ఐఏఎస్ (1990 బ్యాచ్ రాజస్థాన్ కేడర్)
అనుభవం	: 33 ఏండ్లు
ప్రస్తుత హోదా	: కేంద్ర రెవెన్యూ కార్యదర్శి

79 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీలో పుత్తడి ధర రూ.79 వేల దిగువకు పడిపోయింది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి రూ.190 తగ్గిన తులం ధర రూ.78,960కి దిగొచ్చింది. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.190 తగ్గి రూ.78,650గా నమోదైంది. కానీ వెండి ధరలు పెరిగాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి రూ.350 పెరిగి రూ.93,850 పలికింది. కానీ, హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర స్వల్పంగా రూ.160 పెరిగి రూ.77,780కి చేరుకున్నది. అలాగే 22 క్యారెట్ గోల్డ్ ధర రూ.150 అందుకొని

రూ.71,300కి చేరింది. అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ఎంసీఎక్స్ మార్కెట్లో బంగారం ధరలు పెరిగినప్పటికీ రిటైల్‌గా మాత్రం తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరాఫ్ అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,673 డాలర్లు పలుకగా, వెండి 32.19 డాలర్ల వద్ద ఉన్నది.

రూపాయి.. బెంబేలు

చారిత్రక కనిష్ఠ స్థాయి 84.86కి విలువ

ముంబై, డిసెంబర్ 9: దేశీయ కరెన్సీకి మరిన్ని చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొనడంతోపాటు దేశీయ ఈక్విటీలు కుదేలవడంతో కరెన్సీ విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్‌లో సోమవారం ఒకేరోజు 20 పైసలు నష్టపోయి నెల కనిష్ఠ స్థాయిని 84.86ని తాకింది. మునుపెన్నడు లేని స్థాయికి పతనమైనట్లు అయింది. డాలర్‌కు అనూహ్యంగా దిగుమతిదారుల, విదేశీ బ్యాంకుల నుంచి డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. 84.70 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 84.86 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరకు ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి కరెన్సీ విలువ 20 పైసలు కోల్పోయి 84.86 వద్ద ముగిసింది. గత శుక్రవారం 5 పైసలు పెరిగి 84.66 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఈ నెల 4న చారిత్రక కనిష్ఠ స్థాయి 84.75ని తాకిన విషయం తెలిసిందే. రూపాయి పతనంతో భారత్ దిగుమతులపై అధికంగా చెల్లింపులు జరుపాల్సి ఉంటుంది.

రోజూ 10 లక్షల స్పామర్స్

గుర్తించిన ఎయిర్‌టెల్ ఏఐ నెట్‌వర్క్

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: తమ కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత స్పామ్ ఫిల్టర్.. రోజూ 10 లక్షల స్పామర్స్‌ను గుర్తించినట్టు సోమవారం భారతీ ఎయిర్‌టెల్ ప్రకటించింది. ఇక గత రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్‌ను, 80 కోట్ల ఎస్ఎంఎస్‌లను కూడా గుర్తించినట్టు ఈ దేశీయ ప్రైవేట్ రంగ టెలికం సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. దీంతో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌పై వచ్చిన కాల్స్‌లో 6 శాతం, ఎస్ఎంఎస్‌ల్లో 2 శాతం స్పామర్లు చేసినవేనని తేలింది. స్పామ్ కాల్స్ చేసింది, అందుకున్నది రెండింటిలోనూ ఢిల్లీ అగ్రస్థానంలో ఉన్నట్టు సంస్థ వెల్లడించింది. ఢిల్లీ తర్వాత ఏపీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ యూజర్లు స్పామ్ కాల్స్‌ను అధికంగా అందుకున్నారు. ఢిల్లీ తర్వాత ముంబై, కర్నాటకల నుంచి స్పామ్ కాల్స్ ఎక్కువగా వెళ్లాయి. అలాగే ల్యాండ్‌లైన్ ఫోన్ల నుంచే స్పామ్ కాల్స్ అధికంగా వస్తున్నట్టు కనిపెట్టారు. ఎస్ఎంఎస్‌ల విషయాని కొస్తే..



గుజరాత్, కోల్‌కతా, యూపీల నుంచి ఎక్కువగా వచ్చాయి. ముంబై, చెన్నై, గుజరాత్ వాసులే లక్ష్యంగా ఇవి వెళ్లాయి. పురుష వినియోగదారులే లక్ష్యంగా 76 శాతం స్పామ్ కాల్స్ వచ్చాయి. ఈ ఏఐ పవర్డ్ సొల్యూషన్‌ను రెండున్నర నెలల క్రితమే ఎయిర్‌టెల్ అందుబాటులోకి తెచ్చింది. కాగా, దీంతో భారతీయ తొలి స్పామ్ ఫైటింగ్ నెట్‌వర్క్‌గా భారతీ ఎయిర్‌టెల్ నిలిచింది. మొబైల్ వినియోగదారులను విసిగిస్తున్న ఈ అవాంఛిత కాల్స్, సందేశాలకు అడ్డుకట్ట వేయాలని టెలికం సంస్థలను టెలికం రంగ రెగ్యులేటర్ ట్రాయ్ ఆదేశించినది తెలిసిందే.

వాహన ధరలు పెంచిన టాటా, కియా

న్యూఢిల్లీ, డిసెంబర్ 9: వాహన ధరలను మరో రెండు సంస్థలు పెంచాయి. ఇప్పటికే మారుతి, హ్యూందాయ్, మహీంద్రాతోపాటు లగ్జరీ సంస్థలైన మెర్సిడెంజ్ బెంజ్, బీఎండబ్ల్యూ తమ వాహన ధరలను 3 శాతం వరకు పెంచగా..తాజాగా ఇదే జాబితాలోకి టాటా మోటర్స్, కియాలు కూడా చేరాయి. ఉత్పత్తి వ్యయం అధికం కావడంతోపాటు నిర్వహణ ఖర్చులు పెరగడం వల్లనే వాహన ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు ఇరు సంస్థలు ప్రకటించాయి. టాటా మోటర్స్ తన

ప్యాసింజర్ వాహన ధరలను జనవరి నుంచి అమలులోకి వచ్చేలా 3 శాతం వరకు సవరిస్తుండగా, అదే కియో వాహనధరలు 2 శాతం వరకు పెంచుతున్నట్టు తెలిపింది.

12 నుంచి ప్యాకాన్-2024 సదస్సు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ప్యాకేజింగ్ రంగం పురోగతి, భవిష్యత్తు అవసరాలపై ప్యాకాన్-2024 పేరుతో ఈ నెల 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లో సదస్సు నిర్వహించబోతున్నట్లు సీఐఐ తెలంగాణ ప్రకటించింది. రేపటి ప్రపంచ మార్కెట్ సవాళ్ల కోసం నేటి ఆవిష్కరణలు' అనే థీమ్‌తో ఏర్పాటుచేస్తున్న ఈ సదస్సుకు ఆ రంగానికి చెందిన నిపుణులు, ఆవిష్కర్తలు, వాటాదారులు.. పెరుగుతున్న మార్కెట్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయాల్సిన నూతన ఆవిష్కరణలపై చర్చించనున్నట్లు సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి డీ ప్రసాద్ తెలిపారు. సుమారు 200మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సులో ప్యాకేజింగ్ రంగానికి చెందిన ఉత్పత్తులను కూడా ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

దరఖాస్తులు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- మొత్తం 115 దరఖాస్తుల రాక

కలెక్టరేట్, డిసెంబర్ 9: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి ఆదేశించారు. కాగా సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 115 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుడ్డు ధరకు రూ.7 చెల్లించాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉడికించిన గుడ్డు పెట్టడంతో రూ.2 అదనంగా నష్టపోతున్నామని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గొట్టె దేవేంద్ర ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి వినతిపత్రం అందించారు.

ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

పెన్షన్ ఇప్పించాలి..

పెన్షన్ ఇప్పించాలని ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి చింతలకుంట తండాకు చెందిన దివ్యాంగుడు బానోత్ రూప్ సింగ్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతిపత్రం అందించాడు.

లైసెన్స్ హోల్డర్ల మత్స్యశాఖ సంఘంపై ఫిర్యాదు

మధ్యమానేరు ప్రాజెక్టుపై మత్స్య పారిశ్రామిక సహకారం సంఘం ఏర్పాటు చేసిన విధానంతోపాటు లైసెన్స్ హోల్డర్లు చెల్లించిన డబ్బులు, లైసెన్స్ హోల్డర్లు సంఘానికి నిర్వహించాల్సిన విషయాలపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని మధ్యమానేరు ముంపు గ్రామాల లైసెన్స్ హోల్డర్లు తునికి మల్లయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట ఎంబెరి రాజనర్సు, బొమ్మ లక్ష్మి, బొమ్మ భూదేవి, తునికి మల్లేశం, తునికి రాజేశ్, తునికి నర్సయ్య, బొనగిరి నాగరాజు, సత్యం, ప్రవీణ్, ఎల్లయ్య, రఘు, స్వామి, రాములు, నర్సయ్య, నాగరాజు ఉన్నారు.

స్టాంప్ డ్యూటీ ఇప్పించాలి

ధరణి పోర్టల్‌లో స్టాంప్ డ్యూటీ చెల్లించి భూమి రిజిస్ట్రేషన్ కోసం బుక్ చేసిన స్లాట్‌ను సిరిసిల్ల శివనగర్‌కు చెందిన బూట్ల నవీన్‌కుమార్ కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతి పత్రం అందించారు.

బైక్ డివైడర్‌కు ఢీకొని కూలీ మృతి

శంకరపట్నం, డిసెంబర్ 9 : వేగంగా వస్తున్న బైక్ ఓ డివైడర్‌కు ఢీకొనగా బిహార్‌కు చెందిన వలస కూలీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం, పశ్చిమ చంపారన్ జిల్లా హర్నాతండ్ మండలం బెరియఘడ్ గ్రామానికి చెందిన వలస కూలీ మోహన్ కుమార్ చౌదరి (21), తన సోదరుడు అమర్ చౌదరితో కలిసి కొత్తగట్టు శివారులోని ఓ గ్రానైట్ క్వారీలో పని చేస్తుండేవాడు. 4 రోజుల నుంచి కొత్తగట్టులో పని మానివేసి గోపాల్‌పూర్‌కు చెందిన పల్లెపు యాదగిరి వద్ద కూలీ పని చేస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటాక గోపాల్‌పూర్ నుంచి తన అన్న అమర్ చౌదరి వద్దకు కొత్తగట్టుకు బైక్‌పై బయలుదేరాడు. కొత్తగట్టు గ్రామ శివారులోని జేసీఎం ఫంక్షన్‌హాల్ వద్దకు రాగానే నిర్మాణంలో ఉన్న జాతీయ రహదారి డైరెక్షన్ బోర్డుకు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కుమార్ చౌదరి సోదరుడు అమర్ చౌదరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.



విద్యార్థులకు అవగాహన

ఇల్లంతకుంట, డిసెంబర్ 9 : గాలిపెల్లి ప్రాథమిక పాఠశాల నాలుగో తరగతి విద్యార్థులకు సోమవారం పలు ప్రభుత్వ కార్యాలయాలపై క్షేత్రస్థాయిలో సందర్శించి అవగాహన కల్పించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారి పేర్కొన్నారు. ఇక్కడ తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, వైద్యాధికారి డాక్టర్ శరణ్య, మండల వ్యవసాయాధికారి సురేశ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మాదాసి రాంబాబుపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ పట్టణాధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు

వేములవాడ, డిసెంబర్ 9: శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థాన గోశాల నుంచి కోడెలను గోవధశాలకు విక్రయిస్తున్న మాదాసి రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ బీజేపీ పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ రేగుల సంతోష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ, వరంగల్ జిల్లా గీసుకొండ మండలం మనుగొండ గ్రామానికి చెందిన మాదాసి రాంబాబు ఓ సొసైటీ పేరుతో దాదాపుగా 60కోడెలను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ గోశాల నుంచి తీసుకెళ్లి గోవధ శాలలకు అమ్ముతున్నట్లు తేలిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కోడెల పంపిణీ పేరిట హంగుఆర్భాటాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కోడెల పంపిణీలో జరుగుతున్న అక్రమాలను పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని ఆరోపించారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న బీజేపీ నాయకులు

మండల స్థాయి టాలెంట్ టెస్టు

ఇల్లంతకుంట, డిసెంబర్ 9 : మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం మండల స్థాయి బయాలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు ను విజయవంతంగా నిర్వహించామని ఇన్‌చార్జి ఎంఈవో తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇల్లంతకుంట, గాలిపెల్లి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయినులు ప్రేమలత, పావని ప్రశ్న పత్రాలను విడుదల చేశారన్నారు. తెలంగాణ బయోసైన్స్ ఫోరం ద్వారా ఈ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ టీబీఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, టీబీఎస్ఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మహేశ్ చంద్ర, జిల్లా సెక్రెటరి యాద రవి, ఉపాధ్యాయులు రామేశ్వర్ రెడ్డి, రాములు, రమేశ్, సంగీత వాణి, ప్రేమలత, సీఆర్పీలు నర్సయ్య, మల్లేశం, హేమ, విద్యార్థులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కొత్తపల్లి, డిసెంబర్ 9 : పంచాయతీ కార్యదర్శులు గత కొన్ని నెలలుగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ కార్యదర్శులు సర్వేలు, ఇతర శాఖలకు సంబంధించిన విధులు నిర్వహిస్తూ పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. సర్వేల సమయంలో సెలవు దినాల్లో మినహాయింపు ఇవ్వాలన్నారు.

బల్దియాను సంప్రదించండి..

కార్పొరేషన్, డిసెంబర్ 9 : ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే మరో రెండు రోజుల్లోగా ముగియనుందని ఇప్పటివరకు మీ ఇంటికి సర్వేకు సంబంధించి ఎవరూ రాకుంటే నగరపాలక సంస్థలో సంప్రదించాలని నగర కమిషనర్ చాహత్ బజ్ పాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలను కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీం అధికారులకు కాల్ సెంటర్ ఫోన్ నంబర్ 98499066 94కు కాల్ చేసి, వివరాలను తెలిపి నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా పడిపూజ

చొప్పదండి, డిసెంబర్ 9: పట్టణానికి చెందిన ఎన్నం మునీందర్ నారికేళ స్వామి ఇంటి వద్ద మహాపడిపూజ కార్యక్రమం గురుస్వామి గొల్లపల్లి శ్రవణ్ కుమార్ , శ్రీ వెంకటేశ్వర మణికంఠ అయ్యప్ప దేవాలయ అర్చకుడు బ్రహ్మశ్రీ ఫాలోజ్ చరణాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలాధార 18 సంవత్సరాల నుంచి నిర్విరామంగా వేసుకుంటూ ఈ సంవత్సరం నారికేళ స్వామి ఎన్నం మునీందర్ గురుస్వామి దివ్య పదునెట్టంబడి మహా పడిపూజ కార్యక్రమం అభిషేకాలు, పేటతుళ్లి ఆటలు, భజన కార్యక్రమలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండె సత్యానందం, స్వాములు కత్తి రమేశ్ పాల్గొన్నారు.